# స్వప్న - నేను !

స్వప్న అంటే నాకెంతో ఇష్టం! ఎంతంటే... బంగినిపల్లి మామిడిపండు తిన్నంత! నూజివీడు రసం పెరుగు అన్నంలో కలుపుకుని జుర్రుకున్నంత! మండువేసవిలో ఐస్‌క్యాండీ చీకినంత !!

ఐస్‌క్యాండీ అనగానే చిన్నతనం గుర్తుకొస్తుంది ! స్వప్న నేను కలిసి ఒకే క్యాండీని కొనుక్కుని చెరొకవైపు నుండి కొరుక్కుతినటం బలే మజాగ వుండేది. లొట్టలేస్తూ... చీకుతూ... చప్పరిస్తూ... కమ్మదనాన్ని ఆస్వాదిస్తూ కరిగి పుల్ల మిగిలేదాకా తినేవాళ్లం! ఇద్దరం పోటీపడి... నాకంటే నాకని ఆ పుల్లని చప్పరించేవాళ్లం!. ఆరోజుల్లో అదెంత మధురంగ వుండేదో వళ్లు పులకరిస్తుంది తల్చుకుంటేనే!

స్వప్న నాకంటే రెండేళ్లు చిన్న! మావి పక్కపక్క ఇళ్లు! మా ఇదువురి మద్య స్నేహం ఏర్పడి... బలపడి... బాగా క్లోజయ్యాం! చెట్టాపట్టాలేసుకుని ఇద్దరం కలిసి ఒకే రిక్షాలో కాన్వెంట్‌కెళ్లేవాళ్లం.

నాకు పెట్టకుండా తానేదీ తినేదికాదు! నేనూ అంతే! లంచ్ బాక్సుల్లో ఐటమ్స్ ఇద్దరం షేర్ చేసుకోవటం అలవాటు!.

స్వప్నతో కలిసి తొక్కుడుబిళ్ల... చెమ్మ చెక్క... అచ్చనగిల్లలు... ఉప్పాలకుప్ప ఆడటం నాకు భలే సరదా! మూడో వారినెవ్వరినీ మా మధ్యకు రానిచ్చేవాళ్లం కాదు.

ఇద్దరం కలిసి స్కిప్పింగ్ ఆడుకుంటూంటే నంబరంతో సర్వస్వం మర్చిపోయేవాళ్లం!

ఒకరోజున... ఒకే మామిడిపండును నేను స్వప్న చెరొకవైపు నుండి కొరుక్కుతినటం స్వప్నవాళ్ల మమ్మీ కంటబడటంతో... ఆంటీ గబగబా మావద్దకొచ్చి ఇద్దర వీపుల మీద పడికిలి బిగించి గుద్ది 'ఇదేం వెధవ పనర్రా... ఒకరి ఎంగిలి మరొకరు తినటం తప్పు కదూ?... ఇంకోసారి ఇలాంటి వెధవ్వేషాలు చూశానంటే వళ్లు చీరేస్తాను...' వార్నింగిచ్చి స్వప్నని జరజరా రెక్కపుచ్చుకుని ఇంట్లోకి లాక్కెళ్లింది.

అప్పుడు నాకేడుపొచ్చింది. నన్ను ఆంటీ కొట్టినందుకు కాదు స్వప్నను చావగొట్టినందరుకు నాకెంతో బాధన్పించింది. ఆంటీ మీద పడి నా పదునైన గోళ్లతో

రక్కాలన్పించింది. ఆ పని చేయలేక నిస్సహాయంగ చూస్తూండిపోయాను.

స్వప్నను కోప్పడటం... కొట్టటం నాకస్సలు ఇష్టముండదు. కొట్టిన వారిపై తిరగబడాలన్పిస్తుంది. పౌరుషం... కోపం... ఏకకాలంలో నన్ను కుదిపేసేవి.

స్వప్నను కొట్టినందుకు వాళ్ల మమ్మీ బ్యాడ్ మమ్మీ అన్పించింది. డాడీ చాలా మంచి మనిషి!. ఏదైనా కొనితెస్తే ఇద్దరికే ఇచ్చేవాడు. రోజులో ఎక్కువ సమయం స్వప్న ఇంట్లోనే గడిపేవాడిని.

మేము మామిడుపండు షేర్ చేసుకుని తిన్నరోజు నుండి... నన్ను చూస్తే ఆంటీ అదోమాదిరిగా వుండటం మొదలైంది. వెనకటిలా నన్ను దగ్గరకు తీసుకుని స్వప్నతో పాటు జంతికలు.... బెల్ల బూంది... రవ్వలడ్డు ఇంట్లో చేసిన అయిటమ్సు నాడు పెట్టటం మానేసింది. ఆంటీకి కన్పించకుండా తనకు పెట్టిన వాటిలో సగం నాకు చాటుగ పెట్టేది స్వప్న.

మేమిద్దరం క్లాస్‌లో ఫస్టే!. సెంట్‌పర్సెంట్ మార్కులొచ్చేవి. స్వప్నవాళ్ల డాడీ నన్నూ ఎంతగానో మెచ్చుకునేవాడు. దగ్గరకు తీసుకుని ఇద్దరి తలలు ఆప్యాయంగ నిమిరేవాడు. వీపు మీద చేత్తో మృదుమదురంగా దాసేవాడు. మీ ఇద్దరూ ఇలాగే స్నేహంగ వుండాలర్రా... మంచి మార్కులు తెచ్చుకోవాలి!.... తెల్సిందా? అంటూ ఎంకరేజ్ చేసేవాడు.

మామిడికాయల సీజన్లో అయితే ఇద్దరం వూరి చివర తోటలోకెళ్లి కాపలావాడి కంట పడకుండా కాయలు కోసుకిని తినేవాళ్లం. ఒక్కొక్కకాయను ఇద్దరం కలిసి కొరుక్కుతినటం మిగిసేక ఒకరిమూతి మరొకరు నాక్కుంటూ మహదానందం పడేవాళ్లం. అరమరికలు లేని ఆప్యాయతానురాగాలు కలబోసిన స్నేహం మాది! తర్వాత స్వప్న లంగాతో ఇద్దరం...మూతులు తుడుచుకుని ఇంటిదారి పట్టేవాళ్లం!

స్వప్న చాలా అందంగ వుంటుంది. తదేకంగ కళ్లార్పకుండా ఆమెనే చూస్తూండాలన్పించేది. ప్రపంచసుందరి సైతం స్వప్నముందు బలాదూరన్పించేది.

మగవారిలో అందగాళ్లు అరుదు! అరుదైనవారిలో నేనొకడిని! నాకు దగ్గరవటానికి... స్నేహం చేయటానికి ఎవరైనా ఇష్టపడేవాళ్లు నా చిన్నతనంలో. ఆడమగ ఫ్రెండ్సంతా నా బుగ్గగిల్లి ముద్దాడేవారు. మా మమ్మీ రోజూ స్కూల్‌నుండి ఇంటికిరాగానే... ఉప్పుతోనో... ఎండుమిర్చితోనో దిష్ఠి తీస్తూండేది. నాది వత్తైన నల్లని

కర్లీ హెయిర్. నా జుత్తులోకి చెయ్యిపోనిచ్చి క్రాష్ చెరిపేస్తూ వుండటం స్వప్నకో సరదా!.

చిన్ననాటి సంగతులు గుర్తుకొచ్చినప్పుడల్లా నాగుండె బరువెక్కుతుంది. మనసు కకావికలమౌతుంది. ఆవేదన నన్ను వుక్కిరి బిక్కిరి చేస్తుంది. స్వప్నకూ అలాగే అన్పిస్తూంంటుందేమో?

స్వప్న దొడ్లో నూతి దగ్గర డ్రాయరేసుకుని నీళ్లుతోడుకుని బక్కెట్లో పోసుకుని స్నానం చేయటం చూశాను. వళ్లంతా సబ్బుతో రుద్దుకోవటం చూశాను. కానీ... వీపు దుద్దుకోలేక ఇబ్బందిపడటం గమనించి... నేను పరుగుపరుగున వెళ్లి సబ్బుతో స్వప్న వీపురుద్దుతూంటే చక్కిలిగిలిగా వుందేమో కిలకిలా నవ్వుతూ మెలికలు తిరిగిపోతోంది... 'చాల్లే సత్యం... ఇక ఆపు!... మా మమ్మీ చూసిందంటే నన్ను చితక్కొడుతుంది...' తప్పించుకోచూస్తూ అంది.

'మీ మమ్మీ ఇంట్లోనే వుందా?-'

గుడికెల్లింది వచ్చే వేళైంది...' ఇంట్లోకి తుర్రుమంది.

ఇంతలో ఆంటీ నేరుగా వచ్చి కోపంతో వూగిపోతూ 'నీకు దొడ్లో ఏంపనిరా? స్వప్న స్నానం చేస్తుంటే నువ్వు పళ్లికిలించుకుంటూ చూస్తున్నావా? సిగ్గులేదట్రా...' వీపు మీద గుద్దుతూ చెవి మెలేసింది.

ఆంటీ చేతిలోంచి తప్పించుకుని మా ఇంట్లోకి పరుగుతీశాను.

పక్కింటి ఆంటీ మాకు దూరపు బంధువట!. నాకా విషయం మమ్మీ చెప్పగా తెల్సింది. నేను స్వప్నకు బావ వరస అవుతానన్నప్పుడు నా వూహలకు రెక్కలొచ్చి ఆకాశంలో విహరించి నట్టన్పించింది.

X X X

'ఇదిగో స్వప్నా... నీకో విషయం చెప్పనా' కాన్వెంట్లో ఇంటర్వెల్ టైమ్‌లో ప్లేగ్రౌండ్‌లో ఆడుకుంటూండగ అన్నాను.

'ఏంటది?-'

'మనం చుట్టాలమట!... నేన్నీకు బావనౌతానంట...' సంబరపడతూ చెప్పాను.

'ఇంతవరకూ నాకు తెలీదే... మమ్మీ ఎప్పుడూ చెప్పనేలేదు సత్యం...'

'మా మమ్మీ నిన్ననే చెప్పింది.'

'అయితే మనం ఇంకా క్లోజ్ అన్నమాట! ఈ సంగతి మమ్మీ డాడీలతో చెప్పేస్తాను... ఏం?-'

'నో నో చెప్పద్దు! మీవాళ్లకు తెలిసేవుంటుంది. అయినా నీతో చెప్పలేదంటే... మనరెండు కుటుంబాల మధ్య ఏవో గొడవలు వుండివుంటయ్...'

కాన్వెంట్ నుండి ఇంటికొచ్చాక డ్రెస్ ఛేంజ్ చేసుకున్న స్వప్న మమ్మీని వెక్కుంటూ వెళ్లి 'మమ్మీ... మన పక్కింటి సత్యం లేడూ... అతను నాకు బావ అవుతాడంట కదా?... వాళ్లు మన చుట్టాలమా?-' అమాయకంగా తల్లిని ప్రశ్నించింది.

'నోర్ముయ్యవే!... ఇంకోసారి ఇలా మాట్లాడితే వీపు పగుల్తుంది....' తల్లి మండిపడింది.

'అదేంటి మమ్మీ?-'

'అదంతే! ఇంకేం మాట్లాడకు- పద పాలిస్తాను తాగుదువు గానీ...'

తల్లివెంట కిచన్లోకి నడిచింది స్వప్న.

X X X

డిగ్రీలోకొచ్చేసరికి మా మధ్య దూరం ఎక్కువైంది. నా స్కూటర్ వెనుక కూర్చుని కాలేజీకి రావటం మానేసింది! ఈ విషయం నాకు బొత్తిగ నచ్చలేదు.

ఒకరోజు నిలదీసాను. బాగుండదు బావాని దాచేసింది. వేరే ఎవరినైనా లవ్ చేస్తున్నావాని నిగ్గదీశాను. అలాంటిదేమీ లేదంటూ నా తలమీద చెయ్యిపెట్టి ఒట్టేసింది.

మా ఇద్దరి మధ్యా చిన్ననాటి చనువు ఆనందమే కరువైంది. స్వప్నను ఒకసారి గిరగిరా రెండు చేతులూ పట్టుకుని తిప్పుతూండగ మమ్మీ చూచి 'ఒరేయ్... అది పడిపోగలదురా... దానికి కళ్లు తిరుగుతయ్... విడిచిపెట్టు...' అనగానే వదిలిపెట్టాను.

'నీ అల్లరి రానురాను శృతి మించుతోంది! ఇలా చేయటం స్వప్న డాడీ మమ్మీ చూశారంటే బాగుంటుందా? దాని అమ్మకు అసలే మన మీద పీకలదాకా కోపం...' అని మమ్మీ అన్న మాటలు ఇప్పటికీ నా చెవుల్లో గింగురుమంటూనే వున్నయ్.

ఈ విషయం ఆంటీకి ఎలా తెల్సిందో ఏమో స్వప్నను క్లాసుపీకింది. దాని ఏడుపు పోగొట్టేమార్గం తెలుసు కనుక ఇద్దరం కూల్‌డ్రింక్ షాపుకెళ్లి ఐస్‌క్యాండీ కొనుక్కుని ఇద్దరం దాన్ని షేరు చేసుకున్నాం!

ఆరోజుల్లో మా దిద్దరి మధ్య మధురమైన అనుభూతులు... ఆనందాలే వేరు.

పెద్దయ్యాక ఎవరికి వారం అయ్యాం! హలో అంటే హలో అనుకోవలసిన దర్జగి పట్టినందుకు ఇరువురం బాధపడక తప్పటంలేదు.

'స్వప్నా!... మనం లేచిపోదామా అన్నాను...' ఆమాట తెలిసే అన్నానో... తెలియకే అన్నానో నాకు ఇప్పటికీ అర్థం కాదు.

'అమ్మో!... తప్పు!... వద్దు అనేసింది.

'నాకు పెళ్లి సంబంధాలు చూస్తున్నారు మావాళ్లు...' మళ్లీ స్వప్నే అంది బేలగ.

'నువ్వేమన్నావ్? మన సంగతి కుండబద్దలు కొట్టినట్టు చెప్పకపోయావా? - పోనీ మీ డాడీతో నన్ను మాట్లాడమంటావా? - మూగమొద్దులా నిమ్మకు నీరెత్తినట్టు సైలెంట్‌గ వుంటే... మనం ఎవరికి వారే... యమునా తీరే అయిపోతాం! ఆతర్వాత అఘోరించి లాభంలేదు...'

'మొన్న నేను నీ స్కూటర్ మీద ఇంటి దగ్గర డ్రాప్ అవటం చూసిందేమో...' చదివింది చాలు... ఇక ఇంటిపట్టున వుండి... వంట వార్పూ నేర్చుకు తగలడు... మరోసారి ఆ సత్యం స్కూటఱ& మీద నిన్ను చూశానంటే... నీ గొంతుకు తాడేసి నూతిలోకి తోసేస్తాను... జాగ్రత్త...' అల్టిమేటం ఇచ్చింది మమ్మీ.

'అదేం మమ్మీనో అర్థమేకాదు. రాక్షస పుటక. కూతురితో మాట్లాడే తీరేనా ఇది?- నువ్వొట్టి ప్పసుద్దవి. కాస్తంత ఎదురుతిరిగి వుంటే... మీ మమ్మీ దాష్టీకం చేసివుండేదికాదు...' కసిగ మాట్లాడాను.

నేనంటే స్వప్నకీ ఇష్టమే... తనను విడిచి సత్యం వుండలేడు. కాదు... తను లేకుండా బ్రతకలేను. పోనీ ధైర్య చేసి సత్యం చెప్పినట్టు లేచిపోయి రహస్యంగ ఏ గుళ్లోనో పసుపుతాడు కట్టించుకుంటే?- ఇంతవరకు హేపీనే!.. కానీ ఇద్దరికీ చదువు పూర్తికాలేదు. డిగ్రీ అయినా లేకుండా వుద్యోగం ఎలా వస్తుంది? బ్రతకటం ఎలా? జీవితం సినిమానో... టి.వి. సీరియలో కాదు... అన్పించింది. అమ్మ మనసు మార్చే ప్రయత్నం చెయ్యాలి. తప్పదు. అంకుల్ ఎట్లాగూ అభ్యంతరం చెప్పడు. ఆ విషయం తనకు తెలుసు. ప్రాబ్లమల్లా మమ్మీతోనే! చిక్కంతా ఆమెతోటే! డడీ మనిషి సాఫ్ట్. మమ్మీ నోటికి దడుస్తాడు. ఇంట్లో పెత్తనం నిర్ణయాలు అంతా మమ్మీదే.

'మమీ! నేను సత్యాన్ని తప్ప వేరెవరినీ చేసుకోను...' ఒకరోజు తెగేసి చెప్పాను.

'తల్లితో కూతురు మాట్లాడే తీరు ఇదా?- నీకు పొగరెక్కి కొట్టుకుంటున్నావే....'

పళ్లుకొరికింది.

'నేను చేసుకుంటే సత్యం బావనే చేసుకుంటాను. లేకపోతేలేదు...'

'ఇంకోసారి వాడిని బావ అన్నావంటే గరిటె కాల్చి వాతపెడతాను. నీకు ఎప్పుడు ఎవరితో పెళ్లి చేయాలో నాకు తెలుసు! నువ్ నోర్మూసుకో...' రెట్టించింది మమ్మీ.

అమ్మమీద కోపం పెరిగిపోయింది. ఆమె చూస్తూండగానే సత్యం స్కూటర్ వెనుక కూర్చుని కాలేజీకి వెళ్లాను. దోవలో జరిగినదంతా పూసగుచ్చినట్టు బావతో చెప్పేశాను.

'ఆహా! పర్లేదే... నువ్వూ రాణీరుద్రమదేవి అవుతున్నావ్...' పొగడ్తలతో ముంచెత్తాను.

'ఇంట్లో పరిస్థితి నా విషయంలో ప్రతికూలంగ వుంది. మా డాడీ వఠి డమ్మీ!. మమ్మీ ముందు నోరెత్తలేడు...'

'డోన్ట్‌వర్రీ... మైహూనా?..' గర్వంతో మీసం మెలేశాను.

'చాల్లే బడాయి!. మన ప్రాబ్లమ్‌కి సొల్యూషన్ ఏదైనా ఆలోచించు...'

'నాకూ కొత్త ఐడియా ఏడవటంలేదు...'

'అలా అయితే మనిద్దరం ఎప్పటికీ ఏకం కాలేము...'

'రిజల్ట్స్ రానీ... అప్పుడు చూపిస్తా నా తఢాకా...'

'సర్లే నీ కబుర్లు కట్టిపెట్టు! నువ్విలాగే అంటూ వుండు... గద్ద కోడిపిల్లను ఎగరేసుకుపోయినట్టు... వేరెవరో మగాడొచ్చి మెళ్లో తాళికట్టి... తలంబ్రాలు పోసి... శోబనం పూర్తిచేసుకుని ఎత్తుకెళ్లిపోతాడు...'

'జోకు వేయకు స్వప్నా!. మనం కార్యశూరులమే కానీ... శుంఠలం కాదు...'

'ఈసారి నన్ను నీ మీసం మెలేయమంటావా?-'

'అదేంటి?-' బిత్తరపోయాను.

'నీ రెండు చేతులూ స్కూటర్ డ్రైవ్‌చేయటంతో బిజీగా వున్నయ్ కదా...?-'

ఇంతలో కాలేజీ ప్రాంగణంలోకి స్కూటర్ ఎంటరవటంతో... స్టాండ్‌లో పార్క్‌చేశాక ఇద్దరం ఎవరి క్లాసులకు వారు వెళ్లిపోయాం.

X X X

మా రెండు వాటాలకు విడివిడిగ బాత్రూములు నడుమ అడ్డుగోడ వుంది. పాత కాలం నాటివి కాబట్టి సిమెంట్ బెత్తికలు వూడిపోయి ఇటుకలు అరిగిపోయి అక్కడక్కడ కన్నాలు ఏర్పడ్డయ్.

కూడబలుక్కున్నట్టు నేను స్వప్న ఒకేసారి బాత్ రూమ్‌లోకి స్నానానికెడతాం!

'ఓయ్ స్వప్నా... నువ్వూ ఇప్పుడే వచ్చావా?-' అడిగాను

"అఘోరించావ్ సబ్బు రుద్దుకోవటం అయిపోయింది. నువ్వేలేటు. నేనొచ్చానని తెలిసే వచ్చావ్.... కదూ?'

'సరే గానీ నేను సోపు తెచ్చుకోవటం మరిచాను. నీ సోపు గోడ కన్నంలోంచి అందివ్వవాఝుగ?-'

'సోపు కూడా వన్-బై-టుఏనా? సిగ్గులేదు. ఆడవారి సోపు మగాళ్లు రుద్దుకోకూడదమ్మా...'

'ఏంటీ ఎగతాళా? వెటకారమా?

'నా సబ్బా అరిగిపోయి ఏడ్చింది. అర్ధరూపాయి బిళ్లవత దానితో వళ్లేం రుద్దుకుంటావుగానీ... ఈ పూటకు వట్టి స్నానం కానిచ్చెయ్... నీ అందమేం తరిగిపోదులే హీరో...'

'డోన్ట్ బి సిల్లీ! అరిగిపోయిన బిళ్లే ఇవ్వు... ముఖం సోపుతో రుద్దుకుంటాను...'

'ష్ ! గుసగుసలాపు మమ్మీ వస్తున్నట్టుంది. స్వప్న అనటంతో నా నోటికి తాళం పడింది.

ఫైనలియర్ రాకముందే స్వప్నకు మ్యారేజి సెటిలైంది. ఆ విషయం స్వప్న ఏడుస్తూ చెప్తుంటే నా గుండె ఐస్క్యాండీలా ద్రవించింది.

నిన్ను పొందలేని బ్రతుకు వృధా స్వప్నా... నీవు లేకపోతే నేను జీవించలేను....' బావురుమన్నాను.

'ఆడపిల్లలా ఏడవకపోతే... ఏదైనా మంచి ఐడియా ఇవ్వరాదూ?-' కన్నీరు తుడుచుకుంటూ అడిగింది.

'నే చెప్పేది జాగ్రత్తగావిను! రాత్రి బాగా చీకటి పడ్డాక నీ బెడ్‌రూంలోకి దొంగలా జొరబడతాను.

'ఆపని మాత్రం చెయ్యకు... నాకసలే భయం!

'ఛ నోర్ముయ్! మనం ఆడబోయేది డ్రామా మాత్రమే! నేను గదిలోకి ఎంటరైన కొద్దిసేపటికి నువ్వు పెద్దగా కేకపెట్టు. మీ మమ్మీ డాడీ మన గదిలోకొచ్చి దిద్దరినీ చూస్తారు. నేను మాభంగం చేసి వుంటానని మీవాళ్లు వూహిస్తారు. నువ్వేమో కాళ్ల మధ్య తల ఆన్చి ఏడ్చేసెయ్- మరోదారి కానరాక మీ మమ్మీ డాడీ మన పెళ్లి చేయటానికి ప్రిపేరౌతారు. చెడిపోయిన తమ కూతుర్ని... అంటే నిన్ను... ఎవరు పెళ్లి చేసుకోరనే నిర్ణయానికొచ్చి మనల్నిద్దర్నీ ఒకటిచేస్తారు. అప్పుడు కథ సుఖాంతం!. ఎట్లావుంది నా ఐడియా?-' కాలరెగరేశాను.

'ఏడ్చినట్టుంది... ఈ కథ ఎవరికైనా చెప్పు సినీమా తీస్తారు. లేకపోతే ఏంటీ? ఈ కట్టు కథలు మావాళ్లు చచ్చినా నమ్మరు.

'ఓ పని చేద్దాం! మనిద్దరం ఒకటి అయ్యేరాత ఆ విధాన మన ముఖాన రాయలేదు కనుక... ఇద్దరం ఒకేసారి దొడ్లో వున్న బావిలో దూకి ఆత్మహత్య చేసుకుందాం! పై లోకంలోనైనా ఇరువురం ఏకమౌతామేమో?-'

'ఇప్పుడే అంతటి సాహసానికి ఒడికట్టద్దులే బావా! కొన్నాళ్లాగి చూద్దాం...' అనేసి తను ఇంట్లోకెళ్లిపోయింది.

X X X

'ఒరే సత్యం! స్వప్నకు పెళ్లి కుదిరిందిరా! నువ్వేదో దాన్ని ప్రేమించి అఘోరిస్తున్నానన్నావ&?- అంతా వట్టిదేనా?-' మమ్మీ మాటల్లో హేళన నన్ను కలవరపరిచింది.

'రేపు రాత్రికే స్వప్న పెళ్లి - పోనీ ఇదైనా తెలుసా?'

'ఈ పెళ్లి జరగదు... ఆగిపోతుంది చూస్తూండమ్మా. బలవంతాన స్వప్న మెడలు వంచి వప్పించివుండి వుంటారు. నన్ను కాదని వేరొకరితో మెడలో తాళి కట్టించుకోదు-దాని పట్టుదల నాకు బాగా తెల్సు...'

'ఏం తెల్సు... ములక్కాడ పులుసు?- అవతల పెళ్లి సునామీలా ముంచుకొస్తుంటేనూ... సర్లే... నువ్వు భోజనానికిరా...' అన్చెప్పి తల్లి కిచెన్‌లోకి వెళ్లింది.

స్వప్న పెళ్లి తనతో జరక్కపోతే ఏంచేయాలో ఎప్పుడో నిర్ణయించుకున్నారు.

మరునాడు రాత్రి పదిగంటల వేళ స్వప్న వాళ్లింట్లో పెళ్లి బాజాలు మోగుతున్నయ్. నా గుండెల్లో రైళ్లు పరుగెత్తసాగినయ్-

పరిస్థితి చెయ్యిదాటిపోతోందని నా మనసు పదేపదే హెచ్చరిస్తోంది.

అంతలోనే ఏడుపులు పెడబొబ్బలు...

'ఒరే సత్యం... ఇది విన్నావా?... పెళ్లికూతురిలా ముస్తాబైన స్వప్న గదిలో తలుపులు బిడాయించి ఫానుకు వురేసుకుందట...' మమ్మీ చెప్పిన మాటలు విని నా హృదయస్పందన ఆగినట్టయింది.

స్వప్నా... నాకు లేకుండాపోయావా?- మనం కన్న కలలన్నీ కల్లలుగా మిగిల్చావా?- మనం అనుకున్నంతా జరగాలి!- ముందు నువ్వు చనిపోతే... మరుక్షణంలో నేను కన్నుముయ్యాలి... నిన్ను పొందలేని నా జీవితం కూడా వృధా... నేనూ నీవెంటే వస్తాను. నీ అడుగుజాడల్లో నడుస్తాను. పైలోకంలోనైనా మనిద్దరం ఒకటవుదాం!. అక్కడ మనలను ఎవ్వరూ అడ్డుకోలేరు... నాలోనేను దు:ఖిస్తూ నా బెడ్‌రూమ్‌లోకెళ్లిపోయాను. ఇలా జరుగుతుందేమోని ముందుగానే వూహించి పాయిజన్ తెచ్చి ఎవరికంటా పడకుండా ఇంట్లో దాచిన దాన్ని బైటికి తీసి స్వప్ననే తల్చుకుంటూ గటగటా తాగేసి ఆమెకు చేరువైనాను.

పది నిముషాల్లో ప్రాణం పంచభూతాల్లో కలిసిపోయింది! మరణించి నేను స్వప్న ఒకటయ్యాం !!

--- సమాప్తం ---